నేడు బాలయేసు వార్షిక మహోత్సవం

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్ మున్సిపాలిటీ, కమ్మగూడలోని అద్భుత బాలయేసు పుణ్యక్షేత్రంలో వార్షిక మహోత్సవం ఆదివారం ఘనంగా జరగనున్నది. ఈ పుణ్య క్షేత్రంలో జరిగే పండగకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది క్రైస్తవులు, మత పెద్దలు (బిషప్‌లు) హాజరై బాలయేసును దర్శించుకుని స్వస్థత ప్రార్థనలు, నవదిన ప్రార్థనలు చేయనున్నారు.

హయత్‌నగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) :

ప్రతి సంవత్సరం ఫిబ్రవరి రెండవ ఆదివారం ఈ మహోత్సవం ప్రారంభమవుతుంది. స్థానికులు ఈ పండగను (ఊరి పండగగా) పిలుచుకుంటారు. పండగను పురస్కరించుకుని చర్చి కమిటీ నిర్వాహకులు అతిథుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. మహోత్సవాన్ని పురస్కరించుకుని చర్చిని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ముఖ్యంగా దేవమాత గృహంతో పాటు క్రీస్తు జీవిత వృత్తాంతాన్ని తెలిపే పవిత్ర భూమిలో ఏర్పాటు చేసిన మేరిమాత మందిరం, కలవారికొండ, ప్రతిమలు అందరినీ విశేషంగా ఆకట్టుకుంటాయి. 11వ తేది ఆదివారం జరిగే ఈ పండగకు వచ్చే క్రైస్తవులతో కమ్మగూడ, తుర్కయంజాల్ పరిసరాలు జనసంద్రంగా మారుతాయి. శని, ఆదివారం రెండు రోజులపాటు ఈ ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుపుకుంటారు. 11వ తేది ఆదివారం ఉదయం 4గంటలకు దివ్య బలిపూజ తెలుగులో ఫాదర్ గోవిందు ఆరోగ్య స్వామి, ఉదయం 5గంటలకు దివ్య బలిపూజ తెలుగులో ఫాదర్ విల్సన్, ఉదయం 6గంటలకు నగరంలోని బోయిగూడ నుంచి బాలయేసు తేరు ప్రదర్శన ఆరంభం జరుగుతుంది. తేరుకు స్థానికులు పెద్ద ఎత్తున్న స్వాగతం పలుకుతారు. అనంతరం దివ్యబలి పూజ ఇంగ్లీష్‌లో కమ్మగూడ చర్చి ఫాదర్ ఉడుమల జే.చిన్నప్పరెడ్డి, ఉదయం 7 గంటలకు తెలుగులో ఫాదర్ జోజిబాబు, ఉదయం 8గంటలకు తమిళంలో ఫాదర్ రెక్స్ ఏంజలో, 9.30కి బాలయేసు మహోత్సవ దివ్య బలిపూజ ఇంగ్లీష్‌లో ఫాదర్ ఆనంద్ అంద్రు, 11.30కి బాలయేసు మహోత్సవ దివ్య బలిపూజ తెలుగులో కాడినల్ పూల ఆంథోనీ (హైదరాబాద్ అతిమేత్రానులు) చేస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు స్వస్థత ప్రార్థనలు ఫాదర్ జీవన్‌బాబు చేస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు తేరు ప్రదక్షిణ, ఐదు గంటలకు దివ్య ప్రసాద ఆశీర్వాదం ఉంటుందని చర్చి ఫాదర్ ఉడుమల జే.చిన్నప్పరెడ్డి తెలిపారు.

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రైస్తవ భక్తుల రాక

ఈ ఉత్సవాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రైస్తవ మత పెద్దలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి మత గురువులు హాజరై బాలయేసును దర్శించుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రైస్తవ భక్తులు చర్చిలోనే గడుపుతారు.

ప్రత్యేక బస్సు సౌకర్యం

క్రైస్తవులు ఎంతో పవిత్రంగా జరుపుకునే బాలయేసు వార్షిక మహోత్సవానికి ఆర్‌టీసీ నగరంలోని వివిధ ప్రాంత్రాల నుంచి కమ్మగూడ, తుర్కయంజాల్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతుంది. మహాత్మా గాంధీ బస్సు స్టేషన్, సికింద్రాబాద్ జూబ్లీ, దిల్‌సుఖ్‌నగర్, కోఠి, మెహిదిపట్నం, నాంపల్లితో పాటు మలక్‌పేట్ నల్లగొండ క్రాస్ రోడ్డు నుంచి చర్చి వరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తుని ఏర్పాటు చేస్తారు.



కమ్మగూడలోని బాల యేసు పుణ్యక్షేత్రం

కండక్టర్ కోటేశ్వరమ్మకు సీఎం అభినందనలు



కండక్టర్ కోటేశ్వరమ్మను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తనందుకు టీఎస్ఆర్టీసీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. ట్యాంక్‌బండ్ వద్ద శుక్రవారం వంద కొత్త బస్సులను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌లతో కలిసి సీఎం ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీలో అత్యధిక ఆదాయం సమకూర్చిన ఆర్టీసీ సిబ్బందిని సీఎం అభినందించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ డిపోకు చెందిన కోటేశ్వరమ్మకు సీఎం, డిప్యూటీ సీఎం బెస్ట్ ఈపీకే (ఎర్నింగ్ పర్ కిలోమీటర్) అవార్డు అందజేశారు. తమ డిపోకు చెందిన కోటేశ్వరమ్మ కిలో మీటరుకు రూ.93 ఆదాయం సమకూర్చడం గర్వకారణమని డిపో మేనేజర్ మురళీధర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. కోటేశ్వరమ్మను ఆదర్శంగా తీసుకొని సంస్థను లాభాల బాటలో నడిపించాలని డీఎం కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

కండక్టర్‌ను చెప్పుతో కొట్టిన మహిళ

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తాను అడిగిన చోట ఆర్టీసీ బస్సు ఆపలేదని ఆగ్రహించిన ఓ మహిళ కండక్టర్‌పై చెప్పుతో కొట్టింది. ఈ సంఘటన శివరాంపల్లి వద్ద శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. శివరాంపల్లికి చెందిన ప్రసన్న(35) శనివారం మెహిదీపట్నంకు చెందిన 300 నంబర్ బస్సును తాను నిలబడిన చోట ఆపమని చేయి చూపి అడిగింది. కానీ, డ్రైవర్ బస్సు ఆపలేదు. బస్టాప్‌లోకి వెళ్లి బస్సు ఆపారు. దీంతో ఆగ్రహించిన ప్రసన్న బస్టాప్‌లోకి వచ్చి బస్సు ఎక్కి కండక్టర్ నర్సింహతో గొడవపడింది. చెప్పు తీసుకుని కొట్టింది. ఈ ఘటనపై అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి దర్యాప్తు చేస్తున్నారు.



సదస్సులో ప్రొ.డి.నరసింహారెడ్డి, నిపుణులు

దేశంలోని వ్యవసాయ రంగంలో తీవ్ర సంక్షోభం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని న్యూ ఢిల్లీ మానవ అభివృద్ధి సంస్థ అధ్యాపకులు ప్రొ.డి.నరసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. డా.బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, ఆర్థిక శాస్త్ర విభాగం, తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఐసీఎస్ఎస్ఆర్- దక్షిణ భారత దేశ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో "తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు- మూల్యాంకనం" అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును వర్సిటీలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే దేశంలో 80 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారని, రెండు దశాబ్దాల క్రితం దేశ జీడీపీ వృద్ధిలో వ్యవసాయరంగం ఉత్పత్తులు 52 శాతం ఉండగా ప్రస్తుతం 18శాతానికి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముంబై ఇందిరాగాంధీ అభివృద్ధి పరిశోధన సంస్థ మాజీ డైరెక్టర్, ఉప కులపతి ప్రొ.ఎస్. మహేంద్రదేవ్ మాట్లాడుతూ "భారతదేశం 100 అవకాశాలు- సమస్యలు- ఆర్థికాభివృద్ధికి సూచనలు" అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా భారత ఆర్థికాభివృద్ధికి చేసిన సూచనలు, సేవలకు గాను ప్రఖ్యాత ఆర్థిక వేత్త, కేంద్ర ప్రణాళికాసంఘం మాజీ సభ్యులు ప్రొఫెసర్ సి.హెచ్.హనుమంతరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ సామాజిక శాస్త్రాల విభాగ మాజీ డీన్ ప్రొ.టి.జ్యోతి రాణి ప్రొ.జయశంకర్, తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొ.కె.ముత్యం రెడ్డి, కార్యదర్శి డా.బి.వెంకటేశ్వరరావు, అంబేద్కర్ విశ్వవిద్యాలయ ఆర్థికశాస్త్రం విభాగం అధిపతి డా.కె.కృష్ణా రెడ్డి, విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ జి.పుష్పాచక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొ.ఎ.వి.ఆర్.ఎన్.రెడ్డి, సామాజిక శాస్త్రాల విభాగ డీన్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ ప్రొ.రేవ, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పెరుగుతున్న సౌరశక్తి వినియోగం



సోలార్ మీట్‌ను ప్రారంభించిన టీఎస్ రెడ్కో ఎండీ జానయ్య

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సౌరశక్తి వినియోగం పెరుగుతుందని, సోలార్ విద్యుత్‌తో గృహ వినియోగదారులకు అనేక లాభాలున్నాయని టీఎస్ రెడ్కో ఎండీ జానయ్య అన్నారు. గ్రీన్‌టెక్ ఇండియా, అదానీ సోలార్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లో పార్టనర్స్ మీట్ -2024ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జానయ్య మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తున్నాయన్నారు. అదానీ సోలార్ మార్కెటింగ్ హెడ్ సెసిల్ అగస్టీన్ మాట్లాడుతూ తొలిసారి 570 వాట్ల సోలార్ ప్యానెల్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ టెక్ ఇండియా వ్యవస్థాపకుడు సత్య కిరణ్ గన్నారపు, అదానీ సోలార్ సంస్థ ప్రతినిధి ప్రశాంత్, తెలంగాణ రాష్ట్రంలోని పలువురు సోలార్ డీలర్లు పాల్గొన్నారు.

'ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.శంకర్ ఆరోపించారు. శనివారం కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో యూనియన్ బ్యాంకు అవార్డు ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జాయింట్ రీజినల్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ఏబియూబీఈఏ కార్యనిర్వాహక అధ్యక్షుడు టి.రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సును ప్రారంభించిన అనంతరం శంకర్ మాట్లాడారు. ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడానికి కేంద్రప్రభుత్వం బ్యాంకుల విలీనం చేపట్టిందన్నారు. ప్రభుత్వరంగసంస్థల ప్రైవేటీకరణ వల్ల కార్మికులు ఉద్యోగభద్రత కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సదస్సులో యూనియన్ బ్యాంకు హైదరాబాద్ జోన్ చీఫ్ జనరల్‌మేనేజర్ కె.భాస్కర్‌రావు, జనరల్ మేనేజర్ కృష్ణన్, యూనియన్‌బ్యాంకు అవార్డు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సమద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు రెవెన్యూ అధికారుల బదిలీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న ముగ్గురు అధికారులను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. సికింద్రాబాద్ ఆర్డీఓ కారాల్యయంలో డీఏఓగా పనిచేస్తున్న అన్వర్ హుస్సేన్‌ను నల్లగొండ జిల్లాకు బదిలీ చేశారు. అలాగే అంబర్‌పేట్ తహసీల్దార్ భిక్షపతిని, కలెక్టరేట్‌లోని అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ)లో స్పెషల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న నర్సయ్యను సంగారెడ్డి జిల్లాకు ట్రాన్స్‌ఫర్ చేశారు.

పోలీసులపై దుర్భాషలాడుతూ పోస్టు

- నిందితుడిపై క్రిమినల్ కేసులు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీసులు వేసిన చలానా తప్పుగా ఉందని పోలీసులను దుర్భాషలాడుతూ రిపోర్ట్ యాజ్ యాప్‌లో పోస్టు పెట్టిన యువకుడిపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. చాంద్రాయణగుట్టకు చెందిన ముస్తఫాఅహ్మద్ ట్రాఫిక్ ఈ చలానాల ఫిర్యాదు కోసం నిర్వహించే రిపోర్ట్ యాజ్ యాప్‌లో తన హీరో గ్లామర్ వాహనా- నికి చెందిన ఓ చలానాను అప్‌లోడ్ చేశాడు. అనంతరం ఇది తప్పుడు చలానా పోలీసులు కళ్లు మూసుకొని పనిచేస్తున్నారా అంటూ ప్రశ్నించాడు. హిందీలో దుర్భాషలాడుతూ పోస్టు పెట్టాడు. యాప్ నిర్వహిస్తున్న సిబ్బంది చలానా అసలైన వాహనానికే వేసినట్టు నిర్ధారించారు. విధుల్లో ఉన్న పోలీసులను తప్పుదారి పట్టించే విధంగా వ్యవహరించడంతో పాటు దుర్భాషలాడినందుకు ట్రాఫిక్ ఈ-చలాన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు ముస్తఫా అహ్మద్‌పై 504, 506, 509, 186, 189 ఐపీసీతో పాటు ఐటీ సెక్షన్ 67 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకుని రాణించాలని సెయింట్ ఆన్స్ హైస్కూల్ ఛైర్మన్, తెలంగాణ ఉద్యమకారులు కుంట్లూర్ వెంకటేష్ గౌడ్ అన్నారు. వనస్థలిపురంలో శ్రీకృష్ణ మెమోరియల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కోకో, కబడ్డీ, రన్నింగ్ కాంపిటీషన్‌లో సెయింట్ ఆన్స హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి అన్ని విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా శనివారం సెయింట్ ఆన్స హైస్కూల్‌లో విద్యార్థులను సన్మానించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపట్ల ఆసక్తిని పెంపొందించుకుని రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు రాము, ఎం.కార్తీక్, పి.రాంచరణ్, జశ్వంత్, చందన, శ్రావణి, యోగశ్రీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి ఆస్పత్రి రోడ్డు ఆక్రమణను తొలగించండి

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని కృష్ణవేణి ఆస్పత్రి యాజమాన్యం 14 కాలనీలకు సంబంధించిన రోడ్డును ఆక్రమించిందని, దానిని వెంటనే తొలగించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శనివారం జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డయాస్టర్ మేనేజ్‌మెంట్ డైరక్టర్ ప్రకాష్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి యాజమాన్యం రోడ్డును ఆక్రమించి ఆస్పత్రి భవనం నిర్మించిందన్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి 14 కాలనీల ప్రజలకు, హయత్‌నగర్ కోర్టు, ఆర్‌టీసీ డిపోలకు పాఠశాలలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. వెంటనే ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి ఆక్రమణను తొలగించాలని కోరారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్‌కు కూడా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సెమీస్‌లో చంద్రశేఖర్ జోడి

- హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్

హైదరాబాద్ క్రీడా ప్రతినిధి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 16వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఐపీఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, లగడపాటి శ్రీధర్ జోడి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మెన్స్ 50 ప్లస్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో చంద్రశేఖర్ రెడ్డి, శ్రీధర్‌లు 8 - 5 స్కోరుతో కృష్ణారెడ్డి, ఆదిశేషలపై విజయం సాధించారు. 50 ప్లస్ సింగిల్స్ విభాగం క్వార్టర్‌ఫైనల్లో సీవీ ఆనంద్ 8-2 స్కోరుతో చంద్రశేఖర్‌పై అలవోక విజయం సాధించారు.

పురుషుల డబుల్స్ 50 ప్లస్ విభాగం క్వార్టర్ ఫైనల్లో వహీద్, నంద్యాల జోడి 8-4 స్కోరుతో శ్రీనివాస్, ప్రసన్నలపై విజయం సాధించారు. 40 ప్లస్ డబుల్స్ విభాగంలో విజయ్‌వర్మ, వెంకటసాయిలు 8-2 స్కోరుతో సతీశ్, ముతులపై అలవోక విజయం సాధించారు. పురుషుల 30 ప్లస్ సింగిల్స్‌లో సూర్య పవన్ 8-3తో ఈశ్వర్‌పై, అంకేశ్ 8-6తో సురేశ్ రెడ్డిపై పైచేయి సాధించి సెమీస్‌కు చేరారు. 40 ప్లస్ సింగిల్స్‌లో బోస్ కిరణ్ 8-3 తో సురేశ్ ముతుపై గెలుపొందగా, రాజ 8-1 తో శ్రీనివాస కుమార్‌ను ఓడించాడు. 60 ప్లస్ సింగిల్స్‌లో వెంకటేశ్‌పై 8-3తో రామ్‌రెడ్డి, సోమ శేఖర్‌పై 8-3తో మధుకర్ గెలుపొందారు. ఏఆర్‌రావు, గజపతిలు 70 ప్లస్ సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో విజయాలు నమోదు చేశారు. 70 ప్లస్ డబుల్స్‌లో సాయి రాంబాబు, మదన్ మోహన్ జోడి, మధుసూదన్, రవిమోహన్ జోడి సైతం సెమీస్‌కు అర్హత సాధించాయి.



సెమీస్‌లో గెలుపొందిన చంద్రశేఖర్ జోడి

ఘనంగా ఓజోన్ ఆస్పత్రి పదో వార్షికోత్సవం



వార్షికోత్సవంలో ఓజోన్ ఆసుపత్రి ఛైర్మన్ సత్యసాయిప్రసాద్, ఇతర వైద్య బృందం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కొత్తపేటలోని ఓజోన్ ఆస్పత్రి పదవ వార్షికోత్సవాలు శనివారం సాయంత్రం నాగోల్‌లోని పీబీఆర్ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగాయి. ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ జీవన్‌లాల్ లవిడియా, డాక్టర్ జీవీ రావు హాజరయ్యారు. పదేళ్ల కిందట ఆస్పత్రిని ప్రారంభించినప్పటి నుంచి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించామని ఆస్పత్రి ఛైర్మన్ బి.వి.సత్యసాయి ప్రసాద్ వివరించారు.

అల్వాల్, కొత్తపేటలలో తమ ఆస్పత్రి అందిస్తున్న సేవలు రోగుల ఆదరణ పొందుతున్నాయని, ఒక మిలియన్ మంది రోగులకు సేవలు అందించినట్లు ఎండీ దీప్తి గడ్డం తెలిపారు.

ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి

- అబ్దుల్లాపూర్‌మెట్ మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాతీయ దళ విభాగం ఆధ్వర్యంలో శనివారం తుర్కయంజాల్‌లోని వశిష్ట పాఠశాలలో ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన సదస్సు, నాటకం పోటీలు, ఏకపాత్రభినయాలను నిర్వహించారు. రంగారెడ్డి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి అబ్దుల్లాపూర్‌మెట్ మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేంకు తెలంగాణ జాతీయ హరిత దళ విభాగం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు ప్లాస్టిక్ నిషేధంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పూర్తిగా నిషేదించాల చూడాలన్నారు. ప్లాస్టిక్ భూతంలా మారి మానవాళిని నశం చేస్తుందని హెచ్చరించారు. ఆహారం, తాగునీరు, గాలిని, జంతుజాలన్నీ పాడు చేస్తుందన్నారు. రేపటి సమాజం బాగుండాలంటే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను వాడడం మానివేయాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లాలోని 21 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరై ప్లాస్టిక్ నిషేధంపై ఏకపాత్రాభినయాలు, నాటకాలను చక్కగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట మోడల్ పాఠశాల కరస్పాండెంట్ మీనేందర్‌రావు, ప్రిన్సిపల్ మమత, రాష్ట్ర హరిత దళం నుంచి రాజశేఖర్, కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు మురళీమోహనాచారితో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యారినీ విద్యార్థులకు నగదు బహుమతులు ప్రదానం చేశారు.



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బ్రహ్మశ్రీ కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి తదితరుల

శతకోటి గాయత్రి మంత్ర జపయజ్ఞ హవనం కరపత్రం ఆవిష్కరణ

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్ర జ్యోతి): జూలై 27 నుంచి 31 వరకు అయోధ్యలో నిర్వహించే శతకోటి గాయత్రి మంత్ర జపయజ్ఞ హవనం కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని సనాతన ధర్మవారధి వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మశ్రీ కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి, జయలక్ష్మి దంపతులు తెలిపారు. శనివారం అల్కాపురిలో శతకోటి గాయత్రి మంత్ర జపయజ్ఞ హవనం కార్యక్రమం కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వంద కోట్ల గాయత్రి మంత్ర జపానికి హవానం పూర్ణాహుతి, లోక కల్యాణం కోసం శ్రీ సీతారాముల అనుగ్రహం కోసం జరిగిన 1116 శ్రీమద్రామాయణ పారాయణానికి అనుగుణంగా శ్రీ సీతారాముల కల్యాణం, శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం కనుల పండువగా నిర్వహించబడుతుందన్నారు. మహిళలచే సామూహిక కుంకుమార్చనలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

సింగరేణి బస్తీలో గీతం విద్యార్థుల సందర్శన

సైదాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలనీ బస్తీని శనివారం సేవ్ ఫౌండేషన్ లాంటి స్వచ్ఛంద సంస్థ సభ్యులతో కలిసి గీతం విశ్వవిద్యాలయంకు చెందిన 35మంది విద్యార్థులు సందర్శించారు.. బస్తీలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల జీవన విధానం, ఉపాధి, సమస్యలు, పిల్లల విద్యావకాశాలు, ఆరోగ్య సమస్యలు ఆడిగి తెలుసుకున్నారు. ఇక్కడ చాలామంది మత్తుకు బానిసవుతున్నారని పలువురు తల్లిదండ్రులు వివరించారు. దారితప్పుతున్న విద్యార్థులను మంచి మార్గంలో నడిపించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని విద్యార్థులు కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అరవింద్, పావని, శ్రీను, చరణ్, వంశీకృష్ణ, ప్రవ, చిన్మయి తదితరులు పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కార్మికుల చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలు నశించాలని డిమాండ్ చేస్తు ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని ట్రేడ్ యూనియన్ల నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు ఆటోనగర్ మెకానికల్ అండ్ టెక్నికల్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ట్రేడ్ యూనియన్ల రౌండ్ టేబుల్ సమావేశంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరయ్య, శుక్రు, శంకర్ నాయక్, లింగంగౌడ్, కృష్ణయ్య దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిశీలించిన తహసీల్దార్



కబ్జాకు గురౌతున్న ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవీందర్‌దత్తు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ హత్తిగూడ పరిధిలోని సర్వే నెంబర్ 12లో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్తు శనివారం పరిశీలించారు. సర్వే నెంబర్‌లోని 2.33గుంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందని 12వ వార్డు ఆర్‌ఎన్‌ఆర్ కాలనీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ గురువారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆయన కౌన్సిలర్‌తో పాటు సీపీఐ రాష్ట్ర నాయకుడు ముత్యాల యాదిరెడ్డితో కలిసి ప్రభుత్వ భూమిని పరిశీలించారు. క్రీడా ప్రాంగణం, మినీ ఫంక్షన్ హాల్ కోసం ఈ ప్రభుత్వ భూమిని కేటాయించాలని తహసీల్దార్‌ను కోరినట్లు కౌన్సిలర్ తెలిపారు. దీనికి తహసీల్దార్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. భూమి కబ్జాకు యత్నిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవీందర్‌దత్తు తెలిపారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

ప్రియదర్శిని పార్క్ వాకర్స్ అసోసియేషన్ ప్రమాణస్వీకారం

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ చెరువుకట్టపై ఉన్నటువంటి ప్రియదర్శిని పార్క్‌లో వాకింగ్ చేస్తున్నటువంటి వాకర్స్ అందరూ కలిసి నూతనంగా అసోసియేషన్‌ను ఏర్పాటుచేసుకున్నారు. మినీ ట్యాంక్‌బండ్ ప్రియదర్శిని పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా అయిత అశోక్‌గుప్తా, కార్యదర్శిగా రామిని విజయ్‌కుమార్, కోశాధికారిగా కొత్త ప్రసాద్‌గుప్తాలు నియామకమయ్యారు. వాకర్ ఇంటర్నేషనల్ క్లబ్ డిస్ట్రిక్ట్-301 డైరెక్టర్ వై.శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటైన నూతన కమిటీ సభ్యులు శనివారం పీ అండ్ టీ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు వాకర్స్ అభినందనలు తెలిపారు.